# మిగిలింది ఒక్కడే!



- మావోల కంచుకోట ఖాళీ అయింది
- కర్రెగుట్టలో శాంతి పతాకం
- పోలీస్ జెండా ఎగరవేసిన డీజీపీ
- ఇన్నాళ్లు భయం నీడలు
- ఇప్పుడు అభివృద్ధి జాడలు

## ప్రశాంతతకు చిహ్నంగా ఆకాశంలోకి పావురాలు

## లొంగిన మావోలకు పునరావాసం, ఉపాధి అవకాశాలు







**దశాబ్దాలుగా మావోయిస్టుల ప్రాభల్యంతో భయాందోళనల్లో బతికిన కర్రెగుట్టల ప్రాంతంలో ఇప్పుడు శాంతి, అభివృద్ధికి కొత్త బాటలు పడుతున్నాయని, మావోయిస్టు పార్టీ కీలక నేతలందరూ లొంగిపోయారని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి మాత్రమే మిగిలి ఉన్నారని ఆయన కూడా ప్రభుత్వం ముందు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కోరారు.** డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాముమూరు సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపును ఆయన సందర్శించారు. పాముమూరు చేరుకున్న డీజీపీకి పోలీసు అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులతో ఆయన నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.

- వెంకటాపురం, ఆగస్టు 10 (డిడి 9 వార్త)

### డీజీపీ సీవీ ఆనంద్

### 60 ఏళ్ల భయం పోయింది.. శాంతి నడుస్తోంది"

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో భద్రతతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. "60 ఏళ్లుగా ఉన్న భయం ఇప్పుడు పోయింది. కర్రెగుట్టల్లో శాంతి నెలకొంది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ఈ ప్రాంతం పూర్తిగా మారనుంది" అని డీజీపీ భరోసా ఇచ్చారు. మావోయిస్టు కార్యకలాపాలకు దూరమై లొంగిపోయే వారికి ప్రభుత్వం పునరావాసం, ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. మావోయిస్టు పార్టీ కీలక నేతలందరూ లొంగిపోయారని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి మాత్రమే మిగిలి ఉన్నారని ఆయన కూడా ప్రభుత్వం ముందు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన కోరారు. ప్రజలు అభివృద్ధి వైపు అడుగులు వేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.







### మారుమూల గ్రామాలకు లైఫ్‌లైన్‌గా రహదారి

**కర్రెగుట్టల ప్రాంత అభివృద్ధిలో భాగంగా పాముమూరు, చెరిమెల, దోలి, తడపాల మీదుగా ఛత్తీస్‌గఢ్ వరకు నిర్మిస్తున్న సుమారు 30 కిలోమీటర్ల రహదారి పనులను డీజీపీ పరిశీలించారు. ఈ రహదారి పూర్తయితే మారుమూల గ్రామాలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యాపారం, ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని అధికారులకు సూచించారు.**



### పర్యాటక కేంద్రంగా కర్రెగుట్టలు

కర్రెగుట్టల సహజ అందాలను గుర్తించి భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని డీజీపీ తెలిపారు. ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. కర్రెగుట్టల్లో పోలీస్ జెండాను ఎగురవేసిన డీజీపీ.. శాంతికి ప్రతీకగా పావురాలను ఆకాశంలోకి వదిలారు. దీంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతం లో శాంతి, అభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమైన సంకేతాన్ని పోలీసులు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, అడిషనల్ డీజీపీ, ఐజి,ములుగు జిల్లా ఎస్ పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జిల్లా కలెక్టర్ బోర్కాడే హేమంత్ సహదేవరావు, అటవీశాఖ అధికారులు, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు జవాన్లు, వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్యం రమేష్, ఎస్సై తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



